www.jananinadam.com RNI NO:TGTEL/25/A0870 Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460



బుధవారం 24-06- 2026 | సంపుటి: 2 సంచిక: 60 | ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS | పేజీలు : 10 | వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com




## దేశంలో చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలు

**న్యూ డిల్లి జూన్ 23:** గత కొన్నిరోజులుగా ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని వార్త చెప్పింది. దేశంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు పేర్కొంది. తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్‌లోకి ప్రవేశించాయని, వేగంగా విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

## కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ చర్చలు విజయవంతం

- కేంద్రమంత్రులతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చలు
- ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ
- మెట్రో రైలు పై చర్చల్లో కీలక పురోగతి



**న్యూఢిల్లీ23:** హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం.. ఫేజ్-2 విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి గారు జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-ఎ స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులపాటు చర్చలు విజయవంతమయ్యాయి.మొదట సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. ఈరోజు ఉదయం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ గతో, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి , ముఖ్యమంత్రిశ్రీ రేవంత్ రెడ్డి ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు.



## న్యాయమూర్తుల నియామకంలో జోక్యం చేసుకోలేం సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ,23:** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంలు తీసుకునే నిర్ణయాల్లో న్యాయపరంగా జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం సీనియారిటీ ఉన్నంత మాత్రాన జడ్జిగా పదోన్నతి పొందడం హక్కుగా మారదని తేల్చిచెప్పింది. తనకంటే జూనియర్లకు హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించడాన్ని సవాలు చేస్తూ హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సోమవారం విచారించిన ధర్మాసనం, కొలీజియం నిర్ణయాలపై విచారణ జరిపి కొత్త వివాదాలకు తాము తెరతీయదలచుకోలేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు ఇంకా పదేళ్ల సర్వీసు ఉన్నందున ఓపిక పట్టాలని,భవిష్యత్తులో అవకాశం రావొచ్చని సూచించింది.

## భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**హైదరాబాద్ 23:** కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దేశం కోసం యుద్ధం చేయడానికి జన సంఘ్ కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడుపార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత. దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షుడుశ్యామాప్రసాద్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం. 370 ఆర్టికల్ రద్దు,మేక్ ఇన్ ఇండియా,స్టార్టప్ ఇండియా ముఖర్జీ ఆకాంక్షలేదళారీ వ్యవస్థ లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు



## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

### గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జూన్ 23:** కంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



## ప్రభుత్వ ఖాతాలు డిపాజిట్లపై సర్కార్ ఆరా

**హైదరాబాద్23:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్బీఐ వద్ద ఎన్ని ఖాతాలున్నాయో,వాటిలో ఎంత మేరకు డిపాజిట్లు ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఆర్థిక శాఖ అన్ని శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులకు లేఖలు రాసి ఈ వివరాలను సేకరిస్తోంది. ఇటీవల ఎస్బీఐ భూమిని ప్రభుత్వం వేలం వేయడం, దానిపై బ్యాంకు అధికారులు కోర్టును ఆశ్రయించడం వంటి పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్బీఐ నుంచి ప్రభుత్వ డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ శాఖలు ఎస్బీఐ ద్వారా లావాదేవీలు జరుపరాదని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో, కొత్తగా ఎస్బీఐలో డిపాజిట్లు చేయాలంటే తమ అనుమతి తీసుకోవాలని కూడా అన్ని శాఖలకు సమాచారం పంపారు.



## పాఠశాలలు,అంగన్వాడీలకు నిరంతర నీటి సరఫరా

**స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు**

**అధికారలుతో అభివృద్ధి, సంక్షేమాల పై మంత్రి సీతక్క సమీక్ష**

**హైదరాబాద్, జూన్23:** పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదే శాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు.

## ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

**80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్**
**వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట**
**పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం**
**రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన**
**ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన**
**జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం**
**అమరావతిలో ఫైవ్ స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు**



**అమరావతి, జూన్ 23 :** ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలుకీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35 వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి లో ఫైవ్ స్టార్ హోటళు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎం-లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు,




## గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**కల్తీ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా అవసరం**
**ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్సైజ్ శాఖ పనిచేయాలి**
**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు శాఖ సిబ్బంది హాజరయ్యారు. సమావేశంలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అలాగే కల్తీ మద్యం తయారీ, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.ఎక్సైజ్ శాఖ విధులు నిర్వర్తించే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజల భద్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.అక్రమ మాదకద్రవ్యాలు, కల్తీ మద్యం నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.

## కేంద్రమంత్రులతో సీఎం రేవంత్‌చర్చలు విజయవంతం

మొదటిపేజీ తరువాయి...



ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- ఎ వాల్యూయేషన్, స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్–ఎఎ విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (ఓండజఅ) శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా ముందుకు సాగేందుకు కృషి చేస్తారు.

## భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ

మొదటిపేజీ తరువాయి...

అందిస్తున్నాంకేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి..భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివర్ణించారు.దేశం కోసం యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని జన సంఘ్ కార్యకర్తలను పిలుపునివ్వడమే కాకుండా కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడని కొనియాడారు. పార్టీ, వ్యక్తులు, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ అని, దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు,పార్లమెంట్ లో ఏకైక ప్రతిపక్ష నేత కూడా ఆయనేనని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆలోచనలను,ఆశయాలను, ఆకాంక్షలను బీజేపీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు.ముఖర్జీ ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్ పేయి ప్రభుత్వం అణ్వాయుధాలను సమకూరిస్తే..370 ఆర్టికల్ ను రద్దు చేసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను నరేంద్రమోదీ నెరవేర్చారని మహనీయుడి ఆశయాలు,

## పాఠశాలలు,అంగన్వాడీలకు నిరంతర నీటి సరఫరా

మొదటిపేజీ తరువాయి...

అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్ డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎమ్కేఎస్వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్ చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

## ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి...

తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో–57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

### యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

### జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

**సూర్యాపేట జిల్లా,23:** డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాల నివారణ, రోడ్డు ప్రమాదాల నిర్మూలనలో యువత, విద్యార్థులు అంబాసిడర్ గా ఉండాలని ఎస్పి నరసింహ అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఈగల్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు సూర్యాపేట జిల్లా పోలీసుల అధ్వర్యంలో వారం రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. కావున మంగళవారం అనంతగిరి మండల పరిధిలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించి ఉజ్వల భవిష్యత్తుపై అనుసరించాల్సిన విధివిధానాల పట్ల చైతన్యపరిచారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడే వనరులుగా ఎదగాలని ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలని కోరారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా, ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి, సమాజానికి ఉపయోగపడే వనరు కావాలి. ఇష్టం ఉన్న నైపుణ్యం ఉన్న రంగంపై దృష్టి పెట్టాలి గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప లీడర్స్ కావాలి అని ఎస్పి విద్యార్థులను చైతన్య పరిచారు. యువత, విద్యార్థులు దేశ సంపద, దేశ భవిష్యత్తు యువతపై



ఆధారపడి ఉన్నది కావున విద్యార్థుల్లో, యువతలో మార్పు రావాలి, డ్రగ్స్ నిర్మూలన కోసం బాధ్యతగా ఉండాలని కోరారు. డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.డ్రగ్స్ కు అలవాటుపడ్డ వారు నేరాలకు పాల్పడుతున్నారు.అనారోగ్యాలకు గురౌతున్నారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలో యాంటీ డ్రగ్ టీమ్స్ ఏర్పాటు చేశాము, విద్యాసంస్థల్లో ఈ టీమ్స్ డ్రగ్స్ నిర్మూలనకు పని చేయాలి, అధికారులకు సమాచారం అందించాలి అన్నారు. సమాజంలో చెడ్డపేరు వస్తుంది అన్నారు. ఇది మన దేశ యువ శక్తిని నిర్వీర్యం చేస్తుందని. డ్రగ్స్ వినియోగం రవాణా సరఫరా చేయడం తీవ్రమైన నేరం అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన విద్యార్థులు యువత గురించి సమాచారం ఇవ్వండి వీరికి కౌన్సిలింగ్ ఇస్తాము. వీరిలో మార్పునకు కృషి చేస్తాము అన్నారు. మన సమాజంలో డ్రగ్స్ లేకుండా నిర్మూలించడం మన అందరి బాధ్యత అన్నారు. సమాజంలో డ్రగ్స్ ను నిర్మూలించడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలి. డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు అనేవి ఇప్పుడు సమాజంలో మరో పెద్ద సమస్య అని అన్నారు, సైబర్ నేరగాళ్లు ఉచితాలు ఆశలు చూపి ఆర్థికంగా నష్టపరుస్తారు ఓటిపి లు పిన్ నంబర్స్ చెపితే బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు పోతాయి అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ లో సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు అని ఎస్పి కోరారు. ప్రస్తుత సమాజంలో మరో ప్రధాన సమస్య రోడ్డు ప్రమాదాలు వీటివల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం అంతా సమస్యలు ఎదుర్కొంటుందని అన్నారు, విద్యార్థులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వాహనాలపై వేగంగా వెళ్ళవద్దు అని త్రిబుల్ రైడింగ్ లాంటివి నిర్వహించకూడదని బైక్ పై పందాలు పెట్టుకోకూడదని కోరారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు కలలు పిల్లలపై పెట్టుకుంటారని రోడ్డు ప్రమాదాలకు గురై తల్లిదండ్రుల కలలను ఆశలను అందాకారం చేయకూడదని అన్నారు. డ్రగ్స్ కు దూరంగా నిర్మూలనకు పాటుపడతాం డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి రహిత తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటు చేయడంలో ముందుంటామని ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పోలీసు కళాబృందం వారు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, మేళ్లచెరువు ఎస్సై నవీన్ కుమార్, షి టీమ్ ఎస్సై మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేష్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఏం.ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, ప్రసాద్, భూపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# సర్-2026 జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందే..

**హైద్రాబాద్ జూన్ 23:** సర్-2026 (ప్రత్యేక సమగ్రసవరణ(సర్)జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగా ఓటేస్తున్నామంటే అలా కుదరదని స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమంలో భాగంగా ఇలా చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి(డీఈవో), జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి హైదరబాద్ మహానగరంలో ఓటరు పత్రాల పంపిణీ మొదలవుతుందని, జులై 24న ముగుస్తుందని తెలిపారు. నెలరోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు నింపినవారి వివరాలతో మాత్రమే ముసాయిదా ఓటరు జాబితా తయారవుతుంది. ముసాయిదాలోని ఓట్లపై నెల రోజుల పాటు ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్న ఆయన ఆయా ఓటర్లకు నోటీసులు ఇస్తామని చెప్పారు. ఓటరు తగు పత్రాలను అందజేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.గుర్తింపు కార్డుల అవసరం లేదు అక్టోబరు 1, 2026న తుది ఓటరుజాబితా ముద్రిస్తామని, ముసాయిదా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటికి వచ్చిన సమయానికి తాళం వేసి ఉంటే తలుపు, కిటికీల నుంచి పత్రాలను లోపలికి వేస్తారని పేర్కొన్నారు. వాటిలో వివరాలు నింపి సిద్ధంగా ఉంచుకోవాలన్న ఆయన మరో రోజు బీఎల్వో వచ్చి పత్రాలను తీసుకుంటారని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలతో ఎలాంటి గుర్తింపు కార్డులను ఇవ్వాల్సిన అవసరం లేదు.జాబితాలో పేరు లేకుంటేఎన్యుమరేషన్ పత్రాన్ని అధికారులు ఇవ్వరు. వారు ఓటరుగా నమోదయ్యేందుకు ఎప్పటిలాగే ఫారం-6 నింపాల్సి ఉంటుంది. వారికి సర్-2026 సర్వేతో ఎటువంటి సంబంధం ఉండదు. ఇటీవల ఎన్నికల్లో ఓటు వేసిన నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఇల్లు మారిన ఓటర్లకు కూడా ఎన్యుమరేషన్ పత్రం ఇచ్చేది ఉండదు. ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డులోని అడ్రస్?లోనే సదరు వ్యక్తులు ఎన్యుమరేషన్ ఫారం అందుకోవాలి. ఆ చిరునామాతోనే వివరాలను నింపి ఇవ్వాలి. హైదరాబాద్ నగరంలో వివిధ రాష్ట్రాల ఓటర్లను దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు ఇంగ్లిష్?లో ముద్రించిన ఎన్యుమరేషన్ పత్రాన్ని పంపిణీ చేస్తున్నారు. ఓటరు సంతకం చేయాలిఎన్యుమరేషన్ పత్రంలో నింపిన వివరాలు సరైనవని తెలుపుతూ ఓటరు లేదా ఓటరు కుటుంబ సభ్యులు



సంతకం చేయాల్సి ఉంటుంది. జూనియర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని బీఎల్వోలుగా నియమించారు.వారు ప్రతి పత్రాన్ని పరిశీలించి అందులోని వివరాలను బీఎల్వో యాప్‌లో నమోదు చేస్తారన్న ఆయన బీఎల్వో అప్‌లోడ్ చేసే వివరాలను సహాయ ఈఆర్వో, ఈఆర్వోలు ఆమోదిస్తారు. వారికి ఏ మాత్రం అనుమానం వచ్చినా సదరు ఓటరుకు నోటీసు వెళ్తుందని. అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకు అవసరమైన పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

## రైతన్న మీకోసం వారోత్సవ నిర్వహించిన ఏవో ఉషారాణి



**దేవనకొండ జూన్ 23:** మండల కేంద్రంలో రైతన్న మీకోసం వారోత్సవ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి బి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది?. రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం – ఇంటింటి వారోత్సవాలు" మరియు "గ్రామ రైతు వేడుకలు" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోంది. సాగు పద్ధతులు, విత్తన రకాలు, మరియు తెగుళ్ల నివారణపై రైతులకు ఉన్న సకల సందేహాలను నివృత్తి చేసి తగిన సాగు సలహాలను ఉచితంగా అందజేయడం జరుగుతుంది. ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మరియు ఇతర సంక్షేమ పథకాల గురించిన పూర్తి సమాచారాన్ని, అర్హతలను రైతులకు క్లుప్తంగా వివరించారు. పంటలపై ?ఎల్ నీనో ప్రభావం గురించి వివరించి వర్షపాతం సాధారణంగా తగ్గే అవకాశం ఉంది వర్షాభావ పరిస్థితి లపై మరియు పశువర్ధక రంగంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని కాబట్టి నీటి వినియోగం తక్కువ అయినటువంటి చిరుధాన్యపు పంటలు వేసుకోవాలని సూచించారు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతుకు కావలసిన యూరియా డిఎపి ఎరువులను మరియు పంటకు శాస్త్ర సాంకేతికత అందించే యాప్ ను ప్రతి రైతు వినియోగించుకోవాలని తెలియజేశారు. ప్రతి రైతు కూడా ఏపీ ఎఫ్ ఆర్ నందు రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, టిడిపి నాయకులు ఆకుల వీరేష్,ఉచ్చురప్ప,రాజా సాబ్,బండ్లయ్య,జనసేన ఉచ్చురప్ప, ఏఈఓ లు రంగన్న, మల్లికార్జున వి ఏ ఏ కళావతి, హసీనా పాల్గొన్నారు.

## నీటి లభ్యత ఉన్నరైతులు సన్న వడ్లను పండించాలి

**సిద్దిపేట, 23:** జిల్లాలో ఎల్ నీనో ప్రభావం మొదలైందని నీటి లభ్యత ఉన్న రైతులు సన్న వడ్లను పండించాలని కలెక్టర్ కె. హైమావతి అన్నారుకలెక్టర్ మాట్లాడుతూ వర్ష బావ లోటు ఉన్న ప్రాంతాల్లో పప్పు దినుసులు, కూరగాయలు మాత్రమే వెయ్యాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల రైతువేదికలో వ్యవసాయ శాఖ వారు నిర్వహించిన విత్తన మేళ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ముందుగా రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు వేదికలలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి రాష్ట్ర రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర మొత్తంలో అన్ని రైతు వేదికలలో సబ్సిడీతో జూన్ నేటి నుండి జూన్ 30 వరకు విత్తనాల పంపిణీ చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.భారత వాతావరణశాఖ ఎల్ నీనో ప్రభావం మొదలైందని హెచ్చరించడం జరిగిందని దీని వలన వర్షాభావ పరిస్థితులు ఉంటాయని అనుకూలమైన వర్షాలు ఉండవని ఎక్కువ శాతం రైతులు వరి పండిస్తున్నారని దీనికి సక్రమమైన సమయంలో వర్షాలు లేకపోవడం వలన పంట ఎండిపోయి దిగుబడి తగ్గుతుందని కాబట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు కొన్ని రకాల విత్తనాలను ఎంపిక చేస్తారని నీటి పారుదల ఎక్కువ ఉన్న రైతులు సన్న వరి పండించాలని ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను వేసుకోవాలని సూచన చేయడం జరిగింది. వర్షాభావ పరిస్థితిలో ఉన్న ప్రాంతాల్లో పప్పు దినుసులు, నూనె గింజలు, కంది, మినుము, పెసర, మిల్లెట్స్, కూరగాయలు ఇలాంటివి అన్ని కూడా పండించాలి తెలియజేయడం జరిగిందని తెలిపారు. వర్షాబావ పరిస్థితిలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ కూడా



నారుమడులు కూడా వేసుకోలే కాబట్టి మనకున్న వనరులను దృష్టిలో ఉంచుకొని వాతావరణం అనుకూలించే పంటలను పండించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయడం కోసం అన్ని రైతువేదిక లో విత్తనాలు కొనుగోలు చేయడం జరుగుతుందని విత్తన మేళ ఈరోజు నుండి 30వ తారీకు వరకు కొనసాగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.క్లస్టర్ పరిధిలోని రైతు చిన్ని శ్రీనివాస్ రెడ్డి 10 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో పూర్తి సంప్రదాయబద్ధంగా ఏలాంటి రసాయనాలు వాడకుండా పండిస్తున్న అరటి, పొప్పాయి, కోకో, మునగ తోటలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. రసాయనాలు వాడకుండా ఎరువుల తయారీ విధానాన్ని, సూక్ష్మ నీటి సరఫరా గూర్చి రైతు వివరించారు. ఇలాగే సంప్రదాయబద్ధంగా చేస్తున్నందుకు అభినందిస్తూ జిల్లా రైతాంగానికి ఒక ఆదర్శంగా నిలవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఏఓ స్వరూప రాణి, ఏఈఓ మీరా, సర్పంచ్ లు అమ్ములు వెంకటయ్య, మౌనిక నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సృజన సంపత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు విత్తనాలపై అవగాహన ఉండాలి.

**కమాన్ పూర్, జూన్ 23:** ప్రతి రైతుకు విత్తనాలపై అవగాహన కలిగి ఉండాలి అని పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ అన్నారు. పాలకుర్తి రైతు వేదికలో విత్తన మేళా వ్యవసాయ శాఖ అధికారిబండి ప్రమోద్ కుమార్ నిర్వహించారు. ఈ మేళా లో వివిధ రకాల విత్తనాల ప్రదర్శించారు.ఎల్నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు మన రైతులు ప్రత్యేక దృష్టి సాధించాలి అని పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన 7 రకాల వరి విత్తనాలు సన్న వడ్లు అన్ని డీలర్ కేంద్రాల్లో అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు.ప్రభుత్వం ఖరీఫ్ 2026 సీజన్ కొరకు ప్రకటించిన 7 వరి రకాల విత్తనాలు వాటిపై వర్తించే బోనస్ వివరాలు ఈ మేళా లో రైతులకు తెలియజేయడం జరిగింది.ఈ విత్తన మేళాలో ఆరుతడి పంటల విత్తనాలను ప్రతి రకం విత్తనం డిస్‌ప్లే చేయబడింది,ప్రతి విత్తన రకం యొక్క దిగుబడి సామర్థ్యం, తెగుళ్లు–పురుగుల నిరోధకత, నీటి అవసరం,



కోతకు వచ్చే రోజులు, అనువైన భూమి రకం వంటి ముఖ్య లక్షణాలను బ్యానర్లు మరియు పాంప్లెట్ల ద్వారా స్పష్టంగా రైతులకు వివరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో అభ్యుద రైతులు,మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఏఈఓ లు కే.శ్రీకాంత్, జే.సుష్మ ,ఎం. సువర్ణరేఖ పాల్గొన్నారు.

## బూరుగుపల్లి గ్రామంలో వక్ఫ్ బోర్డు భూమిని కాపాడాలని ప్రజావాణిలో వినతిపత్రం

చొప్పదండి23: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో వాక్ఫ బోర్డ్ సర్వే నంబర్ 306 లో 81 గుంటల భూమిని పాత గోరిలను కూల్చడం జరిగిందని ఆ భూమిలో ఉన్న గోరిలను తాళ్ళ మండువగా మర్చారని ముస్లిం కులస్థులకు సంబందించిన వక్ఫ్ బోర్డ్ భూమిని కాపాడాలని మంగళవారం ప్రజావాణి లో కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చినట్లు పలువురు ముస్లిం కులస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం డి చాంద్ పాషా,ఎం డిషర్పుద్దీన్, ఎం డిషారుక్,ఎం డిఇర్ఫాన్ తదితరులు ఉన్నట్లు తెలిపారు

జననినాదం
బుధవారం 24 జూన్ 2026

# డ్రగ్స్ రహిత సమాజమే నిర్మాణమే లక్ష్యం ఎస్పీనితిగా పంత్

## పాఠశాలలు, గ్రామాల్లో విస్తృత అవగాహన




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 23:** యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడడంతో పాటు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణవే లక్ష్యంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులు, గ్రామస్తులకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించినట్లు ఎస్పీ రితిక పంత్ తెలిపారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, విద్య, ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా నేరాల వైపు మళ్లించే ప్రమాదం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. దహెగాం పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశం నిర్వహించారు. బెజ్జూర్, చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

ఆసిఫాబాద్ డివిజన్‌లో లింగాపూర్ రైతు వేదికలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా, తిర్యాణి, సిర్పూర్ (యు) ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలను వివరించారు. కెరమెరి మండలంలోని సంఘ్వి గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు.




ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కొనుగోలు, విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. జిల్లాను పూర్తిస్థాయి డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

# గ్రామాభివృద్ధి ప్రణాళికలు నాణ్యంగా రూపొందించాలి

## సీజనల్ వ్యాధుల నివారణలో అప్రమత్తంగా ఉండాలి

## ఎంపీడీఓ నాగేష్



**జననినాదం,తిర్యాణి 23:** గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2026-27ను గ్రామాల అవసరాలకు అనుగుణంగా నాణ్యంగా రూపొందించాలని ఎంపీడీఓ నాగేష్ అన్నారు. మంగళవారం తిర్యాణి ఎంపీడీఓ కార్యాలయంలో జీపీడీపీ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల భాగస్వామ్యంతో స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించేలా కార్యాచరణ ఉండాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధే జీపీడీపీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ ఉమర్ హుసేన్, ఎంపీఓ ప్రశాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, తిర్యాణి, గిన్నెధరి వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 23:** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మొతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని, సంబంధిత ఓటరు నింపిన ఫారాలను తిరిగి బూత్ స్థాయి అధికారులు సేకరించి వాటి వివరాలను ఎప్పటికప్పుడు యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాటులకు తావు లేకుండా బూత్ స్థాయి ఏజెంట్లు సహాయ సహకారాలు అందించాలని, తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, తమ బూత్ స్థాయి ఏజెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

## వాంకిడి పీహెచ్‌సీ, ప్రభుత్వ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 23:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె వార్డులు, మందుల నిల్వలు, రికార్డులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని పటిష్ఠంగా నిర్వహించాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో క్రమబద్ధంగా నమోదు చేయాలని పేర్కొన్నారు.

అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి అధికారుల హాజరు పట్టికను పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఇంకుడు గుంతల తవ్వకం, జాబ్ కార్డుల నిర్వహణ, కూలీల వేతనాల చెల్లింపులను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. తదుపరి తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు చేపట్టనున్న ప్రత్యేక సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 23:** జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. లింగన్నపేట గ్రామంలో గతంలో 14 నూతన విద్యుత్ పోల్స్, 4 బోర్ వెల్స్ పనులను దాదాపు 20 లక్షల రూపాయల ఈజీఎస్, ఎస్.డి.ఎఫ్. నిధులతో చేపట్టి ఇప్పుడు 10 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏదుల బంధంలో 15 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని, ఆల్గాం, వెంచపల్లి, జనగాం గ్రామాలలో 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం అందించడం జరుగుతుందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 2 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 100 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు



త్రాగునీరు అందించేందుకు నీటి ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 46 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వృత్తి విద్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడంతో పాటు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ లో నీటి వనరుల ఏర్పాటుకు 40 కోట్ల రూపాయలతో ప్రత్యామ్నాయ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య రంగ బలోపేతం దిశగా కృషి చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, 23 మంది వైద్యులను నియమించి చెన్నూర్ లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పున: ప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చి 11 వేల కోట్ల రూపాయల లాభాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఇసుక మాఫియా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, సి.సి. కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆల్గాం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మూత్రశాలలు, విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి 23:** సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు గుణాత్మక విద్య అందించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ తమ పరిధిలోని పాఠశాలలలో ప్రతిరోజు ఒక పాఠశాలను తప్పనిసరిగా సందర్శించి విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను పరిశీలించాలని, చదవడం, రాయడం, మాట్లాడడం వంటి అంశాలను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలలో చర్చించిన అంశాలపై నివేదిక రూపొందించాలని, ఉపాధ్యాయుల వారీగా సమీక్షించాలని, విద్యార్థులకు అందిస్తున్న విద్య బోధన, ఫలితాల సాధన, విద్యార్థుల హాజరు, పఠన సామర్థ్యాల పరిశీలన అంశాలపై క్షుణ్ణంగా చర్చించాలని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా నిర్మాణాత్మక చర్యల ద్వారా విద్య నాణ్యత ప్రమాణాలను పెంపొందించవచ్చని, సత్ఫలితంగా వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన జరుగుతుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరే విద్యార్థుల బదిలీ ధ్రువపత్రాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఉపాధ్యాయులకు సాధ్యమైనంత వరకు విద్య బోధన సంబంధిత విధులు కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బోధనేతర సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, మధ్యాహ్న భోజనం, యు డైస్ లో వివరాల నమోదు ఇతర విధులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, బోధనేతర సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా ప్రజల సౌకర్యం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి 23:** ఆసిఫాబాద్ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. వరద పరిస్థితుల్లో అత్యవసర సేవల కోసం ప్రజలు కంట్రోల్ రూమ్ నంబరు 8500844365లో సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

